క్లుప్తంగా

రేపు తాండవ ఆయకట్టుకు నీరు విడుదల

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి ఆయకట్టుకు సోమవారం నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈఈ పి. అనురాధ శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8.46 గంటలకు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి ప్రజాప్రతినిధులు, ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ సభ్యులు నీటిని విడుదల చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఆయకట్టు రైతులు హాజరు కావాలని ఆమె కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రావు

ఏలేశ్వరం: గ్రామ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు సూచించారు. మండలంలోని జె.అన్నవరంలో శనివారం బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కురాకుల రాజా అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని సూచించారు. రైతులందరూ ఆర్‌బీకేల్లో ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, బంధం అనిల్‌కుమార్, కోట నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రత్తిపాడు ఎస్‌ఈబీ సీఐ చిరంజీవి

ఏలేశ్వరం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్‌ఈబీ సీఐ ఎల్.చిరంజీవి సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం ప్రిన్సిపాల్ డి.సునీత అధ్యక్షతన నిషా ముక్త భారత్ అభియాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత ఉంచి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలతో జీవితం నాశనమవుతుందన్నారు. పిల్లల పవర్తన పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రగడ ప్రయాగమూర్తి, చెన్నారావు, వెంకటేశ్వరావు, వీరభద్రరావు, సురేష్, మేరి తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంకు సేవా కార్యక్రమాలు



వసతి గృహానికి ఎల్ఈడీ టీవీ అందిస్తున్న ఇండియన్ బ్యాంకు అధికారులు

గోకవరం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోకవరం ఇండియన్ బ్యాంకు శాఖ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది. దీనిలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఫైళ్లను భద్రపరుచుకునేందుకు ఒక బీరువా, సంజీవయ్య నగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఎల్ఈడీ టీవీని వితరణ చేశారు. వీటిని శనివారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు ఆధ్వర్యంలో బ్యాంకు జోనల్ మేనేజర్ సుభాకర్‌బాబు, బ్రాంచి మేనేర్ సూర్య పాఠశాల, వసతి గృహాలకు అందించారు.

సత్యదేవుని దర్శించిన ప్రవచనకర్త 'నందూరి'



సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న నందూరి శ్రీనివాసరావు దంపతులు

అన్నవరం: ప్రముఖ ప్రవచనకర్త నందూరి శ్రీనివాసరావు శనివారం కుటుంబ సభ్యులతో కలసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి వేదపండితులు వేదాశీస్సులు అందజేసి ప్రసాదాలు బహూకరించారు. వారి వెంట సీహెచ్. రామ్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

జోరుగా..హుషారుగా..

- మెట్టలో ముమ్మరంగా ఖరీఫ్ పనులు
- ఇప్పటికే 58 శాతం వరినాట్లు పూర్తి
- సాగు పనుల్లో అన్నదాతలు బిజీ

తుని రూరల్: వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సాగు పనులు జోరుగా..హుషారుగా సాగుతున్నాయి. మెట్ట ప్రాంతం కావడంతో ఎక్కువ శాతం ఇక్కడ వర్షాధారంగానే సాగు జరుగుతుంది. ఈ సంవత్సరం వర్షాలు ఆలస్యం కావడంతో ఖరీఫ్ వరినాట్లు ఆలస్యమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కాలువలకు జలకళ సంతరించుకోవడంతో రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు.

15171 హెక్టార్లలో..

సబ్ డివిజన్ పరిధిలోని కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాలకు తాండవ, పంపా, ఏలేరు జలాశయాల నుంచి సాగునీరు అందుతుంది. తుని మండలంలో కొంత మేర పంపా, పుష్కర, తాండవపై మిగిలిన రైతులు విద్యుత్ బోరుబావులు, వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్నారు. సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో 15171 హెక్టార్లలో ఖరీఫ్ నాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 8846 హెక్టార్లలో రైతులు నాట్లు వేసినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇప్పటికే పంపా రిజర్వాయర్ నుంచి సాగునీరు విడుదల చేయడంతో తొండంగి మండలంలో ఆయకట్టు రైతులు నాట్లు వేస్తున్నారు. ఈ నెల 19న ఆయకట్టుకు తాండవ జలాశయం నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. పుష్కర, ఏలేరు జలాలతో పాటు వర్షాలు కురుస్తుండడంతో తుని మండలంలో పది గ్రామాలు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలస్యంగా వర్షాలు కురిసినా ఐదు మండలాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదయ్యింది. ఖరీఫ్ సీజన్‌లో జూన్ ఒకటి నుంచి ఆగస్టు 15 వరకు తుని, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో అధికంగాను, కోటనందూరు మండలంలో అత్యధికంగానూ వర్షపాతం నమోదైంది.

జలాశయాల్లో నీటి నిల్వలు

105 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల పంపా రిజర్వాయర్‌లో 99.7 అడుగులు నీటి నిల్వలు ఉన్నాయి. 380 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల తాండవ రిజర్వాయర్‌లో 376 అడుగులు నీటి నిల్వలు ఉన్నాయి. 283.99 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఏలేరు జలాశయంలో 270.51 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ఏరియాల్లో ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల్లో గరిష్ట నీటి నిల్వలు చేరే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి ఆయకట్టుకు సాగునీరు చేరుతుంది. అలాగే సాగునీటి చెరువుల్లోనూ నీటి నిల్వలు పెరుగుతున్నాయి. పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి సాగు చేసే తుని మండలం వి.కొత్తూరు, లోవకొత్తూరు, రాజుపేట, కొత్త వెలంపేట, మర్లపాడు తదితర గ్రామాల్లో నేటికి వరినారు, నాట్లు వేసే పరిస్థితులు కనిపించలేదు.



కాకరాపల్లిలో నాట్లు వేస్తున్న రైతులు



వి.కొత్తూరులో సాగునీరు లేక వరినారు, నాట్లు వేయని భూములు

సబ్‌డివిజన్‌లో ఖరీఫ్ సాగు, వర్షపాతం వివరాలు

మండలం	సాధారణ సాగు (హెక్టార్లలో)	పూర్తయిన నాట్లు (హెక్టార్లలో)	సాధారణ వర్షపాతం (మిల్లీ మీటర్లలో)	నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
కోటనందూరు	3907	2163	276	743
తుని	2610	1303	405	495
రౌతులపూడి	2033	1960	417	564
శంఖవరం	1285	721	417	521
తొండంగి	5336	2699	399	585

అదును పదును చూసి నాట్లు వేయాలి



తుని సబ్‌డివిజన్ పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాధారంగా ఖరీఫ్ సాగు చేసే రైతులు అదును పదును చూసి నాట్లు వేయాలి. సాగునీరు లభ్యతలేని ప్రాంత రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి. చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలి. ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి. ఈ-క్రాప్ బుకింగ్ చేస్తేనే పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

ఘనంగా వేంకటేశ్వరస్వామి శాంతికల్యాణం



తంటికొండలో స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం శనివారం కన్నులపండువగా జరిగింది. లోక కల్యాణార్థం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్, లక్ష్మీదేవి దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, మణి దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. శ్రావణమాసంలో రెండో శనివారాన్ని పురస్కరించుకుని విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆన్‌లైన్‌లో ఆస్తి పన్ను చెల్లింపు

తుని రూరల్: గ్రామీణులు సైతం ఆన్‌లైన్‌లో సులభంగా ఆస్తి పన్నులు చెల్లించవచ్చని ఈఓపీఆర్‌డీ జయరామ్ శనివారం తెలిపారు. 2024–25 సంవత్సరం నుంచి ఆస్తి పన్ను వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకూ ఆస్తిపన్నుకు సంబంధించి ముద్రించిన రసీదులు ఇచ్చామన్నారు. ఇకపై ఆన్‌లైన్ రసీదులు అందజేస్తామని, దాని ఆధారంగా గృహ, గృహేతర పన్నులు ఇళ్లవద్ద నుంచి కంప్యూటర్ ద్వారా చెల్లించవచ్చని తెలిపారు.

సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గమ్మ



సరస్వతీ మాత అలంకారంలో దర్శనమిచ్చిన వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణ మాస జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం అమ్మవారు వీణాపాణి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు రుత్విక్కులు నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, మూలమంత్ర జపాలు, బాల, కన్య, సువాసినీ పూజలు, చండీ పారాయణలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకూ లక్ష కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమండ్ర శర్మ, ఉపాధ్యాయుల రమేష్, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రతపురోహితులు నాగాభట్ల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు చేయించుకోవాలి



వీఏఏలకు సూచనలు చేస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: రైతులందరూ ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. శంఖవరంలోని వీఏఏలు, రైతులు, కౌలు రైతులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవడం ద్వారా పకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందుతుందన్నారు. పంటల వివరాల్లో పొరపాట్లు జరగకుండా చూడాలని వీఏఏలకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సలీం, రజాక్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాల సమర్పణ

గోకవరం: మండలంలో పెంటపల్లిలో ముత్యాలమ్మ జాతర సందర్భంగా శనివారం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. సుమారు 150 మంది మహిళలు బోనాలను గ్రామంలో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత మూడేళ్లుగా అమ్మవారి జాతర సందర్భంగా బోనాల సంబరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై రఘునాథరావు తెలిపారు. గ్రామ శివారున మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఒకరిని అరెస్టు చేసి అతని నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసు

గండేపల్లి: ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఏఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పి.సూరంపాలెంలో గురువారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడి దాడి చేసుకున్నారన్నారు. దీనిపై రెండు వర్గాలపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



పి.చామవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

రౌతులపూడి: మండలంలోని పి.చామవరంలో రైతులకు శనివారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవనశాఖ అధికారి పి.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు వంద శాతం రాయితీపై హెక్టార్‌కు రూ.27 వేల విలువైన 143 మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలకు హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్ల పాటు రాయితీ లభిస్తుందన్నారు. ఆయిల్‌పామ్ పకృతి విపత్తులను తట్టుకోగల పంట అని తెలిపారు. అనంతరం ఆయిల్ పామ్ పంట ప్రయోజనాలు, మార్కెట్ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ మేనేజర్ బి.వెంకటేశ్వర్లు, పీఓ జె.అయ్యప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో పొలంబడి



సిరిపురంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ జ్యోతి

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయధికారి బి.జ్యోతి రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి సాగులో 45 రోజుల పాటు పునరుత్పత్తి జరుగుతుందన్నారు. పురుగులు కనిపించినా వెంటనే విచాక్షణారహితంగా క్రిమి సంహారక మందులు కొట్టరాదన్నారు. మిత్రపురుగులను కాపాడుకుంటూ నాణ్యమైన, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం జీవామృతం తయారీపై ప్రయోగాత్మకంగా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

తొండంగి: శ్రావణమాసంలో శనిత్రయోదశిని పురస్కరించుకుని శనివారం మండలంలోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొండంగి, ఒంటిమామిడి, బెండపూడి, ఎ.కొత్తపల్లి, అద్దరిపేట, పంపాదిపేట, పైడికొండ, శృంగవృక్షం శివలయాల్లో నవగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

దోషులను శిక్షిద్దాం.. సమాజాన్ని రక్షిద్దాం

- కోల్‌కతా హత్యాచార ఘటనకు నిరసనగా ఆందోళనలు
- విధులు బహిష్కరించిన వైద్య సిబ్బంది
- గ్రామాల్లో ర్యాలీలు



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన వైద్య సిబ్బంది. చిత్రంలో నిలిచిపోయిన ట్రాఫిక్

ఏలేశ్వరం: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై ఇటీవల జరిగిన హత్యాచారం ఘటనకు వ్యతిరేకంగా తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని వైద్య సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పని చేస్తున్న సిబ్బంది విధులను బహిష్కరించి ఆందోళన చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏలేశ్వరం పట్టణంలో ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేశారు. మండల వైద్యాధికారి శైలజ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి మెయిన్‌రోడ్ మీదుగా బాలాజీ చౌక్ వరకు ర్యాలీ చేశారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.

వైద్య సేవలు నిలిపివేత

తుని: కోల్‌కతాలోని వైద్యురాలిపై హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తుని-పాయకరావుపేట శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎ.రఘునాథరావు డిమాండ్ చేశారు. జాతీయ ఐఎంఏ పిలుపు మేరకు శనివారం తుని, పాయకరావుపేటలో వైద్యులు నిరసన తెలిపారు. 24 గంటల పాటు అత్యవసర సేవలు మినహా ఇతర వైద్య సేవలన్నిటినీ నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రఘునాథరావు మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో సైతం వైద్యుల రక్షణ చట్టాన్ని కఠినతరం చేయాలన్నారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేసేవరకూ నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి రామకృష్ణ, ట్రెజరర్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి మండలంలో..

కిర్లంపూడి: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై ఇటీవల జరిగిన అత్యాచార ఘటనకు వ్యతిరేకంగా వైద్యాధికారులు, ఫారా మెడికల్ సిబ్బంది నిరసన తెలిపారు. ఏపీ పీహెచ్‌సీ కాకినాడ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు మండలంలోని కిర్లంపూడి, గెద్దనాపల్లి, వీరవరం పీహెచ్‌సీల్లోని వైద్యులు, ఫారామెడికల్ సిబ్బంది శనివారం విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ చేపట్టారు. కిర్లంపూడి పీహెచ్‌సీ నుంచి ర్యాలీగా ఏనుగువీధి సెంటర్‌కు చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ నిరసన కొనసాగుతుందని హెచ్చరించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు పి.రాంబాబు నాయక్, వి.అరుణ, పి.రవికుమార్, అభిషేక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా రౌతులపూడి సీహెచ్‌సీలో వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం ఆందోళన చేశారు. ఆసుపత్రిలో విధుల బహిష్కరించి ప్లకార్డులను ప్రదర్శిస్తూ గ్రామ ప్రధాన వీధులు గుండా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవి మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన దాడి అమానుషం అన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డా.పావని, సౌమ్య, స్వాగత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం ఘటనకు నిరసనగా ప్రత్తిపాడులో డాక్టర్లు, వైద్య సిబ్బంది శనివారం ఆందోళన చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌ఆర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది రోడ్డెక్కారు. ప్రత్తిపాడు కమూనిటీ హెల్త్ సెంటర్, మండలంలోని రాచపల్లి, పెద్దిపాలెం, శాంతి ఆశ్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర సేవలు మినహ మిగిలిన అన్ని వైద్యసేవలను బంద్ చేసి ఆందోళన చేశారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, మెయిన్‌రోడ్డు, మార్కెట్ మీదుగా స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య, పీహెచ్‌సీ డాక్టర్లు గీతాసుధ, కొండెపూడి యశస్వీ, మురళీమోహన్‌రెడ్డి, ఆసుపత్రుల వైద్యాధికారులు ఇందన రఘురామ్, ఏవీ రమణ, ఏపీఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు రామిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: కలకతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచార ఘటనకు నిరసనగా శంఖవరంలో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన ర్యాలీ చేపట్టారు. విధులు బహిష్కరించి పీహెచ్‌సీ నుంచి బస్‌స్టేషన్ వరకూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శెట్టిబత్తుల రాజీవ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

జగ్గంపేట: కోల్‌కతా అత్యాచారం ఘటనకు నిరసనగా జగ్గంపేటలో మణికర్ణికా యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి, సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు గున్నాబత్తుల అనూష తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా మండలంలోని వైద్యాధికారులు, సిబ్బంది ఆందోళన చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పీహెచ్‌సీల డాక్టర్లు, వైద్యసిబ్బంది విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. పీహెచ్‌సీల వైద్యులు పి.రవికుమార్, భారతి, అర్చన, రవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని దారుణ హత్యకు నిరసనగా ర్యాలీ

గోకవరం: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని దారుణ హత్యను నిరసిస్తూ శనివారం గోకవరంలో వైద్య సిబ్బంది భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. గోకవరం ప్రభుత్వాస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ వనజకుమారి అధ్యక్షతన కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సునీల్, డాక్టర్ నిఖిత ఇతర వైద్య సిబ్బంది ప్రభుత్వాస్పత్రి నుంచి దేవీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. దేవీచౌక్ వద్ద మానవహారంగా ఏర్పడి వైద్య విద్యార్థినిని దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. దోషులకు శిక్ష పడేవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో నిరసన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



గోకవరంలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



కిర్లంపూడి ఏనుగువీధి సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన వైద్య సిబ్బంది